

వరంగల్‌లో పూల కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న వీధులు



# పూల జాతరకు వేళాయె..

- అంబరాన్నంటనున్న బతుకమ్మ ఉత్సవాలు
- తొమ్మిదిరోజుల పాటు వాకిళ్లు పూదోటలు
- సంబరాల్లో పల్లెపడుచులు

**నేడు ఎంగిలిపూలతో మొదలు**

*పూల పూజకు వేళైంది. నేటి ఎంగిలిపూల నుంచి సద్దుల బతుకమ్మ దాకా ఉత్సవాలు అంబరాన్నంటనున్నాయి. 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సాగే ఆడబిడ్డల ఆటపాటలతో వీధులన్నీ హోరెత్తనున్నాయి. అత్యంత వైభవంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ ఆడబిడ్డలకు ఇష్టమైన వేడుక. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి దాకా రోజూ మహిళలు ఆటపాటలతో బతుకమ్మను కొలుస్తారు. పిల్లాజెల్లా.. గొడ్డుగోదా సల్లంగ ఉండాలని కోరుకుంటారు.*

*- కృష్ణకాలనీ, అక్టోబర్ 13*

తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకలా నిలుస్తున్న బతుకమ్మ పండుగ వచ్చిందంటే.. పల్లెదారులన్నీ పూల పరిమళాలు వెదజల్లుతాయి. రెండు వైపులా పసుపు ఆరబోసినట్లు తంగేడు.. చేనుచెలకల్లోంచి నిక్కినిక్కి చూసే గునుగు, పట్టుకుచ్చు.. ముళ్ల కంచెల మీద నుంచి పలకరించే కట్ల పూలు.. ఇంటి గోడ మీద విరిసి మురిపించే మందారాలు, తలుపు సందుల్లోంచి తొంగి చూసే గన్నేరు.. నేలంతా పరుచుకుని, బంగారాన్ని విచ్చుకునే గుమ్మడి ఇంకా రుద్రాక్ష, గోరింట.. ఇలా తీరొక్క పువ్వు బతుకమ్మ పండుగను ఆహ్వానిస్తూ కనిపిస్తాయి. ఎంగిలిపూల నుంచే ఆడబిడ్డల సందడి మొదలవుతుంది. ప్రకృతి సిద్ధంగా లభించే రకరకాల పూలను, వాటితో గౌరమ్మను పూజించడం ఈ పండుగలోని విశిష్టత. మెట్టినింటికి వెళ్లిన మహిళలంతా ప్రతి బతుకమ్మ పండుగకు పుట్టింటికి చేరుకుంటారు. తొమ్మిదిరోజులపాటు మమతానురాగాల బతుకమ్మలను పేర్చి, సంతానం, పాడీపంటా చల్లంగుండాలని ఆడిపాడుతారు. ఏడాదికి సరిపడా ఆనందాన్ని మూటగట్టుకొని వెళ్తారు. తమకు మంచి భర్త దొరకాలని కన్నెపిల్లలు కోరుకుంటారు. కాగా నేడు ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభం కానుండగా, శుక్రవారం నుంచే సందడి నెలకొంది. మార్కెట్లన్నీ పూలగొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. కొత్తబట్టలు కొనుక్కునేవారితో వస్త్రదుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి.

### స్వరాష్ట్రంలోనే గుర్తింపు

అందరూ సమష్టిగా జరుపుకొనే అందమైన, అద్భుతమైన పండుగ బతుకమ్మ. ఇది తెలంగాణకే గర్వకారణం. బతుకమ్మ పండుగకు తెలంగాణ ఆవిర్భావం తర్వాతే గుర్తింపు దక్కింది. ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పేపూల సంబురం బతుకమ్మను 2014 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. ఉత్సవాలు నేడు ప్రారంభమై 22న సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానబియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. చివరి రోజు అత్యంత ఘనంగా పండుగ జరుపుకొంటారు. చిన్నాపెద్దా తేడాలేకుండా సందడి చేస్తారు. ఆడిపాడి బతుకమ్మను నిమజ్జనం చేసి సద్దులను ఒక్కరికొక్కరు వాయినం ఇచ్చి పుచ్చుకుంటారు.



సిద్ధమవుతున్న హెలీప్యాడ్



జనగామలో సీఎం కేసీఆర్ సభ కోసం ముమ్మరంగా జరుగుతున్న ఏర్పాట్లు

# గులాబీ బాస్ రాక కోసం..

- సీఎం కేసీఆర్ సభకు చకచకా ఏర్పాట్లు
- 16న జనగామకు ముఖ్యమంత్రి
- ఉమ్మడి జిల్లాలో తొలి ప్రచార సభ ఇదే..
- ఇక్కడినుంచే క్యాంపెయిన్‌కు శ్రీకారం
- సిద్ధమవుతున్న సభా వేదిక, ప్రాంగణం
- పర్యవేక్షిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా

జనగామ, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): జనగామ వేదికగా గులాబీబాస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నికల శంఖారావం పూరించబోతున్నారు. ఈ నెల 16న జనగామలో నిర్వహించే సభ ద్వారా ఉమ్మడి జిల్లా ఎన్నికల ప్రజా ఆశీర్వాద సభలకు శ్రీకారం చుట్టబోతున్నారు. 27న స్టేషన్ ఘన్‌పూర్, నామినేషన్ల తర్వాత పాలకుర్తిలో అధినేత బహిరంగ సభలు జరుగుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో 16న జనగామలో సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభావేదిక, హెలీప్యాడ్ పనులు చకచకా జరుగుతున్నాయి. సిద్దిపేట రోడ్డులోని వికాస్‌నగర్ వద్ద మెడికల్ కాలేజీ కోసం కేటాయించిన స్థలంలో మైదానాన్ని చదును చేసి ప్రధాన వేదిక సహా ప్రజలు కూర్చునేందుకు షామియానాలు, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, లైటింగ్ పనులు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం సభా వేదిక మైదానం సహా హెలిప్యాడ్ పనులు, వివిధ ప్రాంతాల నుంచి సభకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. చేర్యాల, కొమురవెల్లి, దూల్మిట్ట, మద్దూరు, బచ్చన్నపేట మండలాల నుంచి వచ్చే వాహనాలకు సిద్దిపేట రోడ్డులో బాలాజీ ఫంక్షన్‌హాల్, శామీర్‌పేట-పసరుమడ్ల మార్గంలో పార్కింగ్‌కు స్థలాన్ని ఖరారు చేశారు. అలాగే నర్మెట, తరిగొప్పుల, జనగామ రూరల్ మండలాల నుంచి వచ్చే వాహనాలకు వడ్లకొండ బైపాస్ రోడ్డులో, రఘునాథపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు ప్రెస్టన్ మైదానం, సూర్యాపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు బతుకమ్మకుంట, ఎన్‌ఎంఆర్ గార్డెన్ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించాలని బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులను కోరారు. హెలిప్యాడ్ కోసం వికాస్‌నగర్‌లో బీఆర్‌ఎస్ సన్నాహక సభ జరిగిన స్థలాన్ని ఖరారు చేసి ఇప్పటికే నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎండవేడిమి ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా ప్రత్యేకం బారికేడ్లు, షామియానాలు, పెద్ద ఎత్తున ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బహిరంగ సభ, సీఎం సభాస్థలి, హెలీప్యాడ్ వద్ద బందోబస్తు వంటి ఏర్పాట్లపై పోలీసుశాఖ కసరత్తు చేస్తున్నది. అధినేత సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ జిల్లా శ్రేణులు ఇప్పటికే రంగంలోకి దిగాయి. సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ, భారీగా జన సమీకరణ చేసేందుకు దిశానిర్దేశం చేస్తున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, జనగామ అభ్యర్థి పల్లా





# బస్‌స్టేషన్లలో దసరా రష్

- పండుగ సెలవులు రావడంతో సొంతూళ్లకు జనం
- ఎక్కడచూసినా సందడిగా ప్రయాణ ప్రాంగణాలు

బతుకమ్మ, దసరా పండుగలకు సెలవులు రావడంతో సొంతూళ్లకు జనం పయనమవుతున్నారు. దీంతో ముల్లెమూట సర్దుకొని విద్యార్థులు, పిల్లాపాపలను వెంటబెట్టుకొని వెళ్లే పెద్దలతో బస్‌స్టేషన్లు సందడిగా మారాయి. శుక్రవారం పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రయాణికులతో హనుమకొండ బస్‌స్టేషన్ కిటకిటలాడుతూ కనిపించింది. పండుగ కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపిస్తున్నది.

*- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్, అక్టోబర్ 13*



భూపాలపల్లిలో పూలు కొంటున్న ప్రజలతో సందడిగా మార్కెట్



హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సందడి



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న హనుమకొండ బస్‌స్టేషన్




### చెప్పుకోండి

1. 'వందేమాతరం' గేయం ఏ నవల నుంచి తీసుకున్నారు?
2. పేపర్ కరెన్సీని విడుదల చేసిన మొదటి దేశం ఏది?
3. ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినస్ ఏ నగరంలో ఉన్నది?





### లిటిల్ హ్యాండ్స్



**పి. రమేశ్,** కాటారం.


### పెద్దల మాట



అందరూ గొప్పగొప్ప సేవలు చేయలేరు. కానీ, చిన్నపాటి సేవ చేసినా గొప్పగా ఉండాలి.

• **మదర్ థెరిస్సా**

### పదసృష్టి



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Heart

Ex : Art

జవాబులు:
1. ఆనందమఠ్,
2. చైనా, 3. ముంబై


# అత్యాశ

ఒక దట్టమైన అడవిలో ఓ గండుచీమ ఉండేది. ఒకరోజు దానికి నీటిపై ప్రయాణం చేయాలని ఆశ పుట్టింది. ఇంతలో పక్కనే ఉన్న చెట్టు నుంచి ఒక ఆకు రాలి కిందపడింది. దాంతో చీమ.. ''మిత్రమా! నాకు నీళ్లలో విహరించాలని ఉంది. నన్ను నీటిపై తీసుకెళ్తావా?'' అని అడిగింది. అందుకు ఆ ఆకు ''సరే!'' అన్నది. చీమను ఎక్కించుకుని.. నీటిపై ప్రయాణం చేయసాగింది ఆకు. అలా ప్రయాణిస్తున్న ఆ గండుచీమకు.. నీటిలోపల ఈత కొడుతున్న చేపపిల్ల కనిపించింది. అప్పుడు చీమ.. 'ఇలా ఆకుపై కూర్చొని ప్రయాణించడం ఏమంత బాగాలేదు. అలా చేపలా సొంతంగా ఈత కొట్టడంలోనే అసలైన ఆనందం ఉంది!' అనుకున్నది. వెంటనే చేపతో.. ''చేప మిత్రమా! నాకు నీలా నీటిలోపల మునకలు వేస్తూ తిరగాలని ఉంది. కొంచెం ఈత నేర్పించవా!?'' అని వేడుకుంది. చేప కూడా ''సరే!'' అంటూ, చీమకు ఈత ఎలా కొట్టాలో నేర్పించింది. దాంతో చీమ ఆనందంగా ఈత కొట్టసాగింది. నీటిపై ఈదుతూ.. గాలిలో ఎగురుతున్న పిచ్చుకను చూసింది చీమ. అంతే! ఎలాగైనా సరే తాను కూడా గాలిలో ప్రయాణించి తీరాలని నిర్ణయించుకుంది. పిచ్చుకను పిలిచి.. ''పిచ్చుక బావా! నన్ను గాలిలో తిప్పవా!?'' అని బతిమిలాడింది. పిచ్చుక కూడా కాదనలేక.. ''సరే!'' అంటూ, తన వీపుపై ఎక్కించుకుని గాలిలో తిప్పింది. అయితే, చీమకు మళ్లీ అత్యాశ కలిగింది. 'ఇలా పిచ్చుక వీపు మీద ప్రయాణించడం కన్నా.. నేనే స్వయంగా గాలిలో ఎగిరితే అద్భుతంగా ఉంటుంది కదా!' అనుకున్నది. ఆ ముచ్చటను పిచ్చుకతో చెప్పింది. ''నాకూ నీలా ఎగరాలని ఉంది. నీ ఈకలు ఇస్తే ఎగురుతాను!'' అన్నది. అందుకు పిచ్చుక.. ''అలా వీలుకాదు మిత్రమా! గాలిలో ఎగరాలంటే రెక్కలు ఉండాలి. అంతేకానీ, ఇలా ఈకలను కట్టుకొని ఎగరలేవు!'' అని చెప్పింది. అయినా చీమ వినిపించుకోలేదు. ''ఫరవాలేదు! నేను ఎగురుతాను. వాటిని నా ఒంటికి అంటించుకున్నాక.. నన్ను పైనుంచి వదిలేయి. అలాగే ఎగురుకుంటూ కిందికి వస్తాను!'' అంటూ మంకుపట్టు పట్టింది చీమ. చేసేది లేక ''సరే! నీ ఇష్టం!'' అంటూ పిచ్చుక తన రెండు ఈకలను చీమకు అంటించి.. గాల్లో వదిలేసింది. అంతే! చీమ గింగిరాలు కొడుతూ కిందపడింది. ఇంకేముంది... దట్టమైన ముండ్ల పొదలో ఇరుక్కోవడంతో బయటికి వచ్చే ప్రయత్నంలో కాళ్లు విరిగి, ఓ మూలన కూర్చుంది. అత్యాశ వల్లే తనకీ గతి పట్టిందని ఎంతో దుఃఖించింది.

**కథ**

**నీతి :** దురాశకు పోకుండా దొరికిన దానితో తృప్తిచెందడం మేలు!

• **కయ్యూరు బాలసుబ్రమణ్యం**



### కనుక్కోండి

కింది బొమ్మ సరైన నీడను కనుక్కోండి.



### తేడాలు కనుక్కోండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com